## సమస్యలు పరిష్కరించాలంటూ...
# ఆశ కార్యకర్తల ఆందోళన



శెనార్తిమీడియా, హుజూరాబాద్

పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు మంగళవారం ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన లెప్రసీ బిల్లులు, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు, పల్స్ పోలియో బకాయిలు మూడేళ్లు గడుస్తున్నా చెల్లించలేదని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల వేలాది మంది కార్యకర్తలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నెలకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల ఏరియర్స్ చెల్లించాలని, 5 లక్షల ప్రమాద బీమా, పి ఎఫ్, ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఏడాదికి 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం గర్భవతుల నమోదు, టీకాల వంటి కొన్ని పనులకే అరకొర పారితోషికం ఇస్తూ, మిగిలిన పనులన్నీ ఉచితంగా చేయించుకుంటూ అధికారులు తమను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు ఇచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తులసి దాస్‌కు అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లత, సుజాత, మాదీనా, ఉమా, విజయలక్ష్మి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ జాతీయస్థాయిలో సత్తాచాటిన అక్షర విద్యార్థి



శెనార్తిమీడియా, కరీంనగర్ :

రామడుగు మండలం గోపాల్రావుపేట అక్షర హైస్కూల్ స్టూడెంట్ ఎస్జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో మూడో స్థానం సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్ తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్టం ఇండోర్ లో డిసెంబర్ 14 నుంచి 19 వ తేదీ వరకు జరిగిన 69వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ కరాటే విభాగంలో అక్షర హైస్కూల్ విద్యార్థి తూడి అక్షర మూడో స్థానం సాధించింది. ఈ సందర్భంగా తూడి అక్షరను కరీంనగర్ సీపీ గౌష్ ఆలం మంగళవారం అభినందించారు. ఎస్జీఎఫ్ గేమ్స్ లో తమ స్కూల్ విద్యార్థులు వరుసగా రెండుసార్లు జాతీయస్థాయికి ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాజు పాల్గొన్నారు.

# ఆడపిల్ల పుడితే రూ.5016, ఆడబిడ్డ పెళ్లికి రూ.10,116



శెనార్తిమీడియా, కరీంనగర్ :

పంచాయతీ ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీని అమలు పరిచారు గంగాధర మండలం మధురానగర్ సర్పంచ్. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మధురానగర్ సర్పంచ్ గా గెలిచిన వేముల భాస్కర్, జీపీ పాలకవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు ఆడపిల్ల జన్మిస్తే రూ.5016, ఆడబిడ్డ పెళ్లికి చీర, రూ.10,116 ఇస్తానన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, గ్రామంలో డ్రెయినేజీ, సీసీ రోడ్లు వేయిస్తానన్నారు.



# విద్యార్థుల పక్షాన ఏబీవీపీ

- నిరంతర ఉద్యమాలతో సమస్యలపై పోరాటం




శెనార్తి మీడియా, కరీంనగర్:

నిరంతర ఉద్యమాలతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తుతున్న ఏకైక విద్యార్థి సంఘంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిలిచిందని ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ తెలిపారు. ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను మంగళవారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ జనవరి 3, 4, 5 తేదీల్లో శంషాబాద్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 800 మంది విద్యార్థి నాయకులు, ప్రొఫెసర్లు, ప్రముఖులు హాజరవుతారని వివరించారు. విద్యారంగ సమస్యలు, విద్యారంగ స్థితిగతులు, రాష్ట్ర సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, మాదకద్రవ్యాల మహమ్మారి నిర్మూలన వంటి అంశాలపై ఈ మహాసభల్లో తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీపతి సాయి తేజ, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యతీరాజు అజయ్, నాయకులు జశ్వంత్, సందీప్, ఓమెష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 50 శాతం సీలింగ్ ఎత్తివేత డిమాండ్

- అంబేద్కర్ విగ్రహానికి వినతి, నిరసన



శెనార్తి మీడియా, మంచిర్యాల:

కేంద్ర ప్రభుత్వం 50 శాతం సీలింగ్ రిజర్వేషన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం సీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గత 40 సంవత్సరాలుగా తమకు న్యాయమైన వాటా కోసం ఉద్యమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్లు దాటరాదన్న తీర్పును కేంద్ర ప్రభుత్వం బూచిగా చూపిస్తూ బీసీలకు న్యాయం చేయడం లేదని వివరించారు. రాజ్యాంగంలో ఎక్కడా 50 శాతం రిజర్వేషన్లు మించకూడదని స్పష్టంగా లేదని తెలిపారు. నలుగురు న్యాయమూర్తులు తీసుకున్న నిర్ణయమే ఆ పరిమితికి కారణమని చెప్పారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఇప్పటికే 50 శాతం సీలింగ్ దాటిందని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, అదే విధంగా బీసీ రిజర్వేషన్లపై కూడా రాజ్యాంగ సవరణ చేసి విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జల్లి వెంకటయ్య, శాఖపూడి భీమ్ సేన్, చంద్రగిరి చంద్రమౌళి, అంకం సతీష్, రామగిరి రాజన్న చారి, ధర్మాజీ మల్లేష్, చెలిమెల అంజయ్య, వేముల కిరణ్, చీరాల తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీలు..

- కోటపల్లి-నీల్వాయి మండలాల్లో స్పెషల్ డ్రైవ్



శెనార్తి మీడియా, మంచిర్యాల (కోటపల్లి):

రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీ ఆదేశాల మేరకు కోటపల్లి మండలం పారుపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు చెన్నూర్ రూరల్ సీఐ, కోటపల్లి పోలీస్ సిబ్బంది, స్పెషల్ పోలీస్ సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు విస్తృతంగా నిర్వహించినట్లు పోలీసులు వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్ డిసెంబర్ 31 వరకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కోటపల్లి, నీల్వాయి మండలాల్లో కొనసాగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారు, తప్పు దారిలో ప్రయాణించే వారు, ట్రిపుల్ రైడింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వారి వాహనాలను సీజ్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. అలాగే రహదారిపై అడ్డంగా వాహనాలు నిలిపివేసినట్లయితే వాటినీ సీజ్ చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, తప్పు దారిలో ప్రయాణం, అతివేగం ఉన్నాయని పోలీసులు చెప్పారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపే వారి పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని, అజాగ్రత్త వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతే కుటుంబాలకు తీరని దుఃఖం మిగులుతుందని పోలీసులు తెలిపారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వాహనదారులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

శెనార్తిమీడియా, కరీంనగర్ :

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి జూడో చాంపియన్ షిప్ పోటీల్లో పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటినట్లు స్కూల్ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు హన్మకొండ పట్టణంలోని జేఎన్ స్టేడియంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి జూడో బాలుర చాంపియన్ షిప్ పోటీల్లో రిషిత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత పథకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హనుమంతరావు, హెచ్ఎం గోపీకృష్ణ, సమన్వయకర్త రబీంద్రపాత్రో, పీఈటీ గోలి సుధాకర్ విద్యార్థిని అభినందించారు.



# గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



- జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ

శెనార్తి మీడియా, శంకరపట్నం

మొలంగూరు, నల్లా వెంకాయపల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించి, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పూదరి రాజు, మేడుదుల నాగలక్ష్మి ఐలయ్య పాల్గొన్నారు. కేశవపట్నం గ్రామంలో సర్పంచ్ గోదారి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 2915 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది సందీప్ కుమార్, సంతోష్, కుమారస్వామి, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.





# సైబర్ నేరాలపై పూర్తి అవగాహన అవసరం

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం
- నకిలీ నోట్ల గుర్తింపు, డిజిటల్ అరెస్ట్ తదితర అంశాలపై పోలీసులకు శిక్షణ

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 'అస్త్ర' హాలులో ఈ–బాట్ (E-BAAT) అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు, నకిలీ నోట్ల గుర్తింపుపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.

**పెరుగుతున్న సైబర్ నేరాలు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అప్పుడే బాధితులకు త్వరితగతిన న్యాయం అందించగలమని పేర్కొన్నారు.

**సైబర్ మోసాలపై వివరణ**

సదస్సులో ఇటీవల సంచలనం సృష్టిస్తున్న 'డిజిటల్ అరెస్ట్', లాటరీ స్కామ్‌లు, అనుమానాస్పద లింకుల ద్వారా జరుగుతున్న మోసాలపై కూలంకషంగా వివరించారు. ఇలాంటి మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు.

**సురక్షిత డిజిటల్ లావాదేవీలు**

యూపీఐ, ఎన్ఈఎఫ్టీ, ఆర్‌టీజీఎస్, ఐఎంపీఎస్ సేవలు వినియోగించే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా యూపీఐ పిన్ భద్రత ఎంత కీలకమో స్పష్టం చేశారు.

**నకిలీ నోట్ల గుర్తింపు**

అసలు నోట్లు, నకిలీ నోట్ల మధ్య తేడాలను గుర్తించే విధానాన్ని వివరించారు. నకిలీ నోట్లకు సంబంధించిన రీఫండ్ నిబంధనలపై కూడా అవగాహన కల్పించారు.

**ఫిర్యాదుల ప్రక్రియపై మార్గనిర్దేశం**

డిజిటల్ లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు లేదా మోసపోయిన సందర్భాల్లో ఫిర్యాదు చేసే విధానం, ఆర్బీఐ అంబుడ్స్‌మన్ సేవలను ఎలా పొందాలో వివరించారు. నగదు రహిత లావాదేవీల ప్రయోజనాలు, సైబర్ భద్రతా చిట్కాలను ప్రాక్టికల్‌గా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ, ఆర్బీఐ అధికారులు, ఆర్బీఐ ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ మేనేజర్ సత్యజిత్ ఘోష్, మేనేజర్ ఖాదర్ హుస్సేన్, కమిషనరేట్‌కు చెందిన ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు



- కమిషనర్ గౌష్ ఆలం
- కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం

**శెనార్తి మీడియా, కరీంనగర్**

పోలీస్ అధికారులకు మెరుగైన పని వాతావరణం కల్పించడం ద్వారా ప్రజలకు మరింత సమర్థంగా, త్వరితగతిన సేవలందించగలనని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధునీకరించిన నూతన భవనాన్ని మంగళవారం ప్రారంభించుకున్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భవనంలో ఏర్పాటు చేసిన విభాగాలను పరిశీలించి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ సదుపాయాలు దోహదపడతాయని తెలిపారు. మహిళా సిబ్బందికి ప్రత్యేక బారక్, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇదివరకు ఈ భవన పైఅంతస్తులో ఉన్న సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను రూరల్ ఏసీపీ కార్యాలయ ఆవరణలోకి మార్చడంతో మొత్తం భవనాన్ని టూ టౌన్ పోలీస్ స్టేషన్ అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి సహా పలువురు పోలీసులు పాల్గొన్నారు.



# చెక్ డ్యామ్ కూల్చివేతలు సహించం

**శెనార్తి మీడియా, మంథని:**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమనపల్లి గ్రామంలో చెక్ డ్యామ్ కూలిన ఘటనపై రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా చెక్ డ్యామ్‌లు కూలుతున్న ఘటనలను ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**విజిలెన్స్ విచారణకు ఆదేశాలు**

కూలిపోయిన చెక్ డ్యామ్‌లపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఈ ఘటనలు ప్రకృతి వైపరీత్యాల కారణంగానా, మానవ తప్పిదాల వల్ల జరిగాయా అనే అంశాన్ని విచారణ రిపోర్ట్ ఆధారంగా తేల్చి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**నాసిరక నిర్మాణమైతే కఠిన చర్యలు**

నిర్మాణంలో నాణ్యతలేమి తేలితే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కావాలనే చెక్ డ్యామ్‌లను ధ్వంసం చేసినట్లు నిర్ధారణ అయితే మరింత కఠిన శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు.

**విచారణ వేగవంతం చేయాలి**

ఈ ఘటనపై విజిలెన్స్ శాఖ విచారణను వేగవంతం చేయాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.



# నెమ్మదించిన కీలక రంగాలు.. నవంబర్‌లో 1.8 శాతంగా నమోదు

కీలక రంగాలు మళ్లీ నెమ్మదించాయి. క్రూడాయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, విద్యుత్ రంగాల్లో నెలకొన్న నిస్తేజం కారణంగా గత నెలకుగాను కీలక రంగాల్లో వృద్ధి 1.8 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.8 శాతం వృద్ధితో పోలిస్తే భారీగా పడిపోయినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. కానీ, అక్టోబర్ నెలలో నమోదైన వృద్ధితో పోలిస్తే మాత్రం మెరుగైన వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది అక్టోబర్ నెలలో మైనస్ 0.1 శాతానికి పడిపోయాయి. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో కీలక రంగాల్లో వృద్ధి సగానికి సగం 2.4 శాతానికి పడిపోయాయి. అంతక్రితం ఏడాది ఇది 4.4 శాతంగా నమోదైంది.

# భారత్ బయోటెక్‌తో బయోఫ్యాబ్రీ జట్టు

BHARAT BIOTECH

భారత్ బయోటెక్‌తో వ్యాక్సిన్ తయారీదారు బయోఫ్యాబ్రీ జట్టు కట్టింది. టీబీ ఔషధం కోసం సాంకేతిక బదిలీ ఒప్పందం చేసుకున్నది. ఇక ఈ ఒడంబడికతో ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని 70కిపైగా దేశాల్లో ఎంటీబీవీఏసీ ఉత్పత్తి, సరఫరాకు భారత్ బయోటెక్ బాధ్యత వహిస్తుంది. 'మా ఈ భాగస్వామ్యం అవసరమున్నవారికి ఈ వ్యాక్సిన్‌ను మరింత చేరువ చేస్తుంది' అని బయోఫ్యాబ్రీ ఆశాభావం వ్యక్తం చేసింది. ట్యూబర్‌క్యులోసిస్, దాని ప్రభావాలను అరికట్టడానికి కృషి చేస్తున్నామని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష ఎల్లా అన్నారు.

# ఆదాయపు పన్ను శాఖ మీ సోషల్ మీడియా, ఈమెయిల్స్ చెక్ చేస్తుందా?




ఆదాయపు పన్ను శాఖ మన సోషల్ మీడియా, ఈమెయిల్స్‌ను చెక్ చేస్తుందా?.. ఏప్రిల్ 1, 2026 నుంచి మన సోషల్ మీడియా హ్యాండిల్స్, ఈమెయిల్స్‌ను యాక్సెస్ చేయగలదా? అనే అనుమానాలు ఇప్పుడు చాలా మందికి కలుగుతున్నాయి. దీనికి కారణం ఇలాంటి ప్రకటనలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటమే.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సదరు పోస్ట్ ప్రకారం, ఏప్రిల్ 1, 2026 నుంచి పన్ను ఎగవేతను అరికట్టడానికి ప్రజల ఈమెయిల్స్, సోషల్ మీడియా ఖాతాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను యాక్సెస్ చేసే అధికారం ఆదాయపు పన్ను (ఐటీ) శాఖకు లభిస్తుందని పేర్కొంది.

ఈ వార్త చాలా మంది పన్ను చెల్లింపుదారుల్లో ఆందోళన కలిగించింది. అయితే, ఈ క్లెయిమ్ తప్పుడు, మిస్‌లీడింగ్ అని ప్రెస్ ఇనార్మేషన్ బ్యూరో (%ూ×దీ%) ఫ్యాక్ట్ చెక్ స్పష్టం చేసింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025లోని సెక్షన్ 247 ప్రకారం, ఐటీ శాఖకు డిజిటల్ స్పేస్‌లను యాక్సెస్ చేసే అధికారం కేవలం సెర్చ్ ఇంకా సర్వే ఆపరేషన్స్ సమయంలో మాత్రమే ఉంటుంది.

అంటే, పెద్దఎత్తున పన్ను ఎగవేత ఆధారాలు ఉన్న సీరియస్ కేసుల్లో మాత్రమే ఇది వర్తిస్తుంది. సాధారణ పన్ను చెల్లింపుదారుల రోజువారీ డేటాను లేదా ప్రైవసీని దీని ద్వారా ఉల్లంఘించరు. ఈ అధికారాలు 1961 చట్టం నుంచే ఉన్నవి, కొత్తగా ఏమీ జోడించలేదు. మాస్ సర్వైలెన్స్ లేదా అందరి ఖాతాలను చెక్ చేయడం జరగదు.

# జనవరి 1 నుంచే ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంపు.. !



వచ్చే ఏడాది నుంచి వివిధ కార్ల ధరలు పెంచుతున్నట్లు ఆయా కంపెనీలు ప్రకటనలు చేస్తున్నాయి. ఇతర టూ–వీలర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు, వాహనాల తయారీ కంపెనీలు ధరల పెంపును ప్రకటించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రముఖ ఎలక్ట్రిక్ టూ–వీలర్ తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తమ కస్టమర్లకు షాకిచ్చింది. తమ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంచుతన్నట్లు ప్రకటన చేసింది.

కొత్త ఏడాది అంటే జనవరి 1, 2026 నుంచే పెంచిన ధరలు అమలులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. అన్ని మోడళ్లపై గరిష‘ంగా రూ.3 వేల వరకు పెంపు ఉంటుందని వెల్లడించింది. ముడి సరకు ధరలు పెరగడం, అంతర్జాతీయంగా కీలక ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు పెరగడం, ఫారెక్స్ ప్రభావం కారణంగా ధరల పెంపు నిరయం తీసుకోవాల్సి వచ్చినట్లు ఏథర్ ఎనర్జీ కంపెనీ వెల్లడించింది. ధరల పెంపు ఒక్కో మోడల్‌పై ఒక్కోలా ఉంటుందని కంపెనీ తెలిపింది.

అదే సమయంలో డిసెంబర్ స్కీమ్ ద్వారా ఎంపిక చేసిన పట్టణాలు, నగరాల్లో ఏథర్ స్కూటర్ కొనుగోళ్లపై రూ.20 వేల వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఏథర్ కంపెనీ 450 సిరీస్‌లో పెరార్మేన్స్ స్కూటర్లు, రిజ్టా పేరిట్ ఫ్యామిలీ స్కూటర్లు మార్కెట్లో ఉన్నాయి. ఆయా స్కూటర్ల ధరలు రూ. 1,14,546 నుంచి ప్రారంభమవుతున్నాయి. గరిష‘ంగా ఈ స్కూటర్ల ధరలు రూ. 1,82,946 వరకు ఉన్నాయి.